

కువైత్ చెరలోని మహిళకు విముక్తి

ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేక చొరవ

27న ఇండియాకు రావడానికి టికెట్ రెడీ

తిరుపతి, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): కువైత్‌లోని ఏజెంట్ చెరలో చిక్కుకున్న మన జిల్లా మహిళకు ఎట్టకేలకు విముక్తి లభించనుంది. ఈనెల 27న ఆమె తిరుపతికి రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని ఆమెకు విమాన టికెట్ సిద్ధం చేశారు. బిడ్డలను చదివించుకోవాలని కష్టపడి కువైత్‌కు వెళ్లి నరకకూపంలో చిక్కుకున్న శ్రీకాళహస్తి మండలం రాజీవ్ నగర్‌కు చెందిన యల్లంపల్లి లక్ష్మి ఆవేదనను సోమవారం 'నన్ను చంపి ఎడారిలో పడేస్తామంటున్నారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. ఈ కథనంపై ఎస్పీ సుబ్బరాయుడు స్పందించారు. దుబాయ్‌లో ఉన్న తిరుపతికి చెందిన ఏపీఎన్ఆర్టీ మాజీ కోఆర్డినేటర్ డాక్టర్ ముక్కు తులసీకుమార్‌తో ఫోన్లో సంప్రదించారు. ఆమెను తిరుపతికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ గిరిధర్‌కు ఆదేశాలిచ్చారు. దీంతో డీఎస్పీ రంగంలోకి దిగి ఆమెను కువైత్‌కు పంపిన పీలేరు ఏజెంట్ శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఆయన ద్వారా కువైత్‌లోని ఏజెంట్‌తో మాట్లాడి టికెట్ పంపారు.

అప్రమత్తంగా ఉండాలి



ఉపాధికోసం విదేశాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి. ఏజెంట్లను గుడ్డిగా నమ్మి మోసపోవద్దు. వెళ్లే ముందు మీ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు పూర్తి వివరాలు ఇవ్వండి. ఏ దేశానికి, ఎవరిద్వారా, ఎలాంటి పనికి వెళుతున్నారనే సమాచారం ఉండాలి. తద్వారా భవిష్యత్తులో అక్కడేమైనా ఇబ్బందులు తలెత్తితే సులభంగా పరిష్కరించవచ్చు. మోసం చేసే ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- ఎస్పీ సుబ్బరాయుడు

పాస్‌పోర్ట్ కోసం ప్రయత్నిస్తున్నాం



కువైత్‌లో శ్రీకాళహస్తి మహిళ లక్ష్మి విముక్తి కోసం తిరుపతి పోలీస్ అధికారులు చూపిన చొరవ అభినందనీయం. పోలీస్ అధికారులు నాతో ఫోన్లో మాట్లాడారు. ఇక్కడి ఏజెంట్ ద్వారా టికెట్ పంపారు. ఇంకా ఆమె చేతికి పాస్‌పోర్టు రాలేదు. రెండు రోజుల్లో పాస్‌పోర్ట్ ఆమెకు అందేలా ప్రయత్నిస్తున్నాం.

- డాక్టర్ ముక్కు తులసీకుమార్,
ఏపీఎన్ఆర్టీ మాజీ కోఆర్డినేటర్

కలెక్టరేట్‌లో ముందస్తు క్రిస్మస్



చిన్నారుల చేత కేక్ కట్ చేయిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రేమ, కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ అని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. తాను మిషనరీ స్కూల్ చదువుకున్నానని గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్, మైనార్టీ సంక్షేమానికి అమలు చేస్తున్న అనేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారుల చేత ఆయన క్రిస్మస్ కేక్‌ను కట్ చేయించారు. పాస్టర్ బైబిల్‌ను కలెక్టర్‌కు బహూకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీఆర్వో నరసింహులు, హరినాథ్‌రెడ్డి, చర్చి పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు. - తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

అమ్మో.. ఇనుప పెట్టె

కాళంగి నది ఒడ్డున కలవరం ● వరదల్లో కొట్టుకొచ్చినట్లుగా అనుమానం



తడ మండలం చేనిగుంట వద్ద కాళంగినది ఒడ్డున ఇనుప పెట్టె కలకలం రేపింది. సోమవారం తెల్లవారుజామున పొలాలకు వెళ్లే రైతులు ఇనుప పెట్టెను గుర్తించి కలవరపడ్డారు. చుట్టుపక్కల గ్రామస్తులను పిలిచి పరిశీలించారు. బరువైన ఇనుప పెట్టె కావడం, మూత నేలవైపు ఉండటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పలుగు, పారలతో అతి కష్టంమీద మూతను తెరిపించారు. అందులో నీళ్ల మాత్రమే ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. పదిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇనుప పెట్టె కొట్టుకువచ్చి ఉంటుందని, రైల్వేకు సంబంధించిన పెట్టెగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు.

- తడ, ఆంధ్రజ్యోతి

నవోదయం-2

వచ్చే నెలలో ప్రారంభం

● నాటుసారా తయారీ, విక్రయాలపై ప్రభుత్వం ఉక్కుపాదం
● కార్యాచరణ సిద్ధంచేస్తున్న జిల్లా అధికారులు

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు.. 2016లో 'నవోదయం' తీసుకొచ్చింది. జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టడానికి చర్యలు చేపట్టింది. అప్పట్లో ఈ చర్యలు సత్ఫలితాలిచ్చాయి కూడా. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మద్యం రేట్లను భారీగా పెంచడంతో.. నాటు సారా తెరపైకి వచ్చింది. జిల్లాలో విచ్చలవిడిగా తయారీ, అమ్మకాలు సాగాయి. వీటిని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం మళ్లీ నవోదయాన్ని అమలు చేయనుంది. వచ్చే నెలలో 'నవోదయం-2' ప్రారంభం కానుంది.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



నారాయణవనం మండలంలో నాటు సారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నవోదయం పథకాన్ని రాష్ట్రంలో మళ్లీ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి సోమవారం ఎక్సైజ్ కమిషనరు, డైరెక్టర్లు జిల్లా స్థాయి అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. కాగా, జిల్లాలో నవోదయం-2 పథకాన్ని అమలు చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత శాఖ అధికారులతో సమావేశమై రానున్న మూడు నెలల్లో సారారహిత జిల్లాగా తయారు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో జిల్లాలోని 12 ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో ఎక్కడెక్కడ నాటు సారా తయారీ.. విక్రయాలు జరుగుతున్నాయనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో పుత్తూరు, నాగలాపురం, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎక్సైజ్ సర్కిళ్ళ పరిధిలోని బాగా వెనుకబడిన ప్రాంతాల్లో నాటుసారా తయారీ ఎక్కువగా ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. చంద్రగిరి మండలం ఎర్రావారిపాలెం, ఏర్పేడు మండలం బత్తినయ్యకాలనీ, కేవీబీ పురం మండలం, నారాయణవనం, నాగలాపురం, పిచ్చాటూరు, పుత్తూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో నాటు సారా తయారు చేస్తున్నారు. మొత్తమ్మీద ఏడు మండలాల పరిధిలోని 18 గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు ఉన్నట్లు గుర్తించారు. కేసులు, పీడీ చట్టాలకు బెదరక.. జైలుకు వెళ్లొచ్చాక కూడా సారా తయారీ, అమ్మకాల వైపు మొగ్గుచూపుతున్నారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో నాటుసారా తయారు చేసి వాహనాల ట్యూబుల్లో నింపి విక్రయిస్తున్నారు.

పునరావాసంపై అధికారుల దృష్టి

నాటుసారా తయారీని పూర్తిగా అరికట్టాలనే ఆశయంతో ప్రభుత్వం మళ్లీ నవోదయం తీసుకొస్తోంది. దీనిని వ్యాపకంగా పెట్టుకున్న దాదాపు 430 మందిని అధికారులు గుర్తించారు. వీరికి బ్యాంకు రుణాలు అందించడం, ఆవులు కొనివ్వడం.. మహిళలైతే డ్వాక్రా గ్రూపుల్లో చేర్పించి బుట్టలు అల్లడం, సాంబ్రాని వత్తుల తయారీని నేర్పడం, టైలరింగ్ ఇలా స్థానికంగా వున్న డిమాండును బట్టి స్వయం ఉపాధి పథకాలు అందించనున్నారు. తయారీదారులకు కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు. అలాగే, ఆయా గ్రామాల్లో గ్రామసభలు పెట్టి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. సారా వల్ల కలిగే నష్టాలను వివరించి వారిలో మానసిక పరివర్తన తెచ్చేందుకు ప్రయత్నించనున్నారు.

● ఫటా ఫట్ ?

టార్గెట్.. మూడు నెలలు

● సారారహిత జిల్లాగా తిరుపతి
● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి



మూడు నెలలు.. సారారహిత జిల్లాగా తిరుపతిని మార్చడానికి అధికారులు పెట్టుకున్న లక్ష్యమిది. ఈ దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి చెప్పారు. మద్యం బెల్టు షాపులపైనా ఎలాంటి చర్యలు చేపడతామనే దానిపై ఆయన స్పందించారు.

ప్రశ్న: నాటుసారా కట్టడికి తీసుకుంటున్న చర్యలు

జవాబు: తిరుపతి డివిజన్‌లో దాదాపు ఏడు మండలాల పరిధిలోని 17 గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయి. అందులో ప్రధానంగా ఎర్రావారిపాళెం, ఏర్పేడు, కేవీబీ పురం, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల పరిధిలోని 50 శాతం గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఉపాధిగా నాటుసారా తయారు చేస్తున్నారు. వీరికి ఉపాధి కల్పించి నాటుసారా తయారీ, అమ్మకాలు నిషేధించడానికి కలెక్టర్ ఒక పథకం రూపొందిస్తున్నారు. తద్వారా రానున్న మూడు నెలల్లో సారారహిత జిల్లాగా మార్చనున్నాం.

ప్రశ్న: బెల్టుషాపుల కట్టడి ఎలా

జవాబు: బెల్టుషాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో 184 కేసులు.. 506 లీటర్ల మద్యం, 13 లీటర్ల బీరు సీజ్ చేశాం. 184 మందిని అరెస్ట్ చేశాం. ఇది నిరంతర ప్రక్రియ. రూ.99 మద్యాన్ని ఇంకా అధిక సంఖ్యలో మద్యం దుకాణాల్లో ఉంచి బెల్టుషాపులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: నూతన సంవత్సరం, సంక్రాంతికి ఈవెంట్ పర్మిట్ల పరిస్థితిపై

జవాబు: నూతన సంవత్సరానికి ఈవెంట్ పర్మిట్ల కోసం చాలామంది ముందుకొస్తారు. వారు దరఖాస్తు చేసిన ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ఈవెంట్ పర్మిట్‌కు అనుకూలంగా ఉంటే అనుమతులు ఇస్తాం. దీని కోసం రోజుకు రూ.5200 ప్రభుత్వానికి చెల్లించాలి. ఎన్ని పర్మిట్లు అవసరమైనా నిబంధనల మేరకు పరిశీలించి మంజూరు చేస్తాం. దీనివల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, గొడవలు జరగకుండా పోలీసుశాఖ ముందస్తు చర్యలు తీసుకుంటుంది.

ప్రశ్న: సిబ్బంది కొరత ఉందా

జవాబు: జిల్లాలో 12 సర్కిళ్లలో ప్రస్తుతం 16 మంది సీఐలు పని చేస్తున్నారు. 28 మంది ఎస్ఐలకుగాను 21 మంది ఉన్నారు. జిల్లాకు మరోవంద మంది కానిస్టేబుళ్లు కావాల్సి ఉంది.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

17 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్ట్



గంజాయిని, నిందితులను చూపుతున్న సీఐ

పుత్తూరు అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పలాస నుంచి చెన్నైకి 17 కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులు సోమవారం పోలీసులకు పట్టుబడ్డారు. ఒక్కో బండిల్‌లో 2 కిలోల చొప్పున 8 బండిళ్లు, మరో కిలో బండిల్.. మొత్తం 9 బండిళ్లలో రూ.2.55 లక్షల గంజాయి పట్టుకున్నారు. పుత్తూరు సీఐ సురేంద్రనాయుడు తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఇరులపాల్యం గ్రామానికి చెందిన ఎం.ప్రభాకరన్ అమెజాన్, బిగ్ బాస్కెట్ వంటి ఆన్‌లైన్ పార్సిళ్లను లోడ్ చేసేవాడు. తోటి కూలీలతో కలిసి గంజాయికి అలవాటుపడ్డాడు. పార్సిళ్ల వాహన యజమాని సురేష్ ద్వారా డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఈక్రమంలో మొగిలన్ పరిచయమయ్యాడు. అతడి ద్వారా మనిమేగలై అనే మహిళతో కలిసి ఈనెల 18వ తేదీన రైలులో పలాసకు వెళ్లారు. అక్కడి రైల్వేస్టేషన్ వద్ద ఇద్దరి నుంచి గంజాయి బండిళ్లు తీసుకున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా రైళ్లు మారుతూ రేణిగుంటకు చేరుకున్నారు. రేణిగుంటనుంచి బస్సులో చెన్నైకి బయలుదేరారు. పుత్తూరు పున్నమి కూడలి వద్ద వాహన తనిఖీల్లో గంజాయి బండిళ్లు ఉన్న ట్టు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుళ్లు రవి, టీఎం రామమూర్తి, ఏకాంబరం, బాలకృష్ణ, కె.యమునను సీఐ అభినందించారు.

'మత్తు'లో యువకుల వీరంగం

● ఆర్టీసీ కండక్టర్‌కు రాయి తగలడంతో నిలదీత
● ఆగ్రహంతో ఆయనపై దాడి

చంద్రగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో కొందరు యువకుల దాడిలో ఆర్టీసీ కండక్టర్ గాయపడ్డారు. పోలీసులకు బాధితుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. చంద్రగిరి పంచాయతీ భారతినగర్‌కు చెందిన సుధాకర్ కుప్పం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి డ్యూటీ అయ్యాక 11.30 గంటల సమయంలో బస్సు దిగి ఇంటికి నడుచుకొంటూ వస్తున్నారు. అదే సమయంలో ఆర్‌ఎఫ్ రోడ్డులో కొంతమంది యువకులు మద్యం లేదా గంజాయి మత్తులో గొడవపడుతూ.. రాళ్లు విసురుకొన్నారు. అందులో ఒక రాయి సుధాకర్‌కి తగిలింది. దీనిపై ఆయన ప్రశ్నించగా.. ఆ యువకులు ఆగ్రహంతో దాడిచేసి గాయపరిచారు. ఈలోగా స్థానికులు వచ్చేసరికి వారు పరారయ్యారు. అపస్మారక స్థితికి చేరుకున్న సుధాకర్‌ను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గాలేరు-నగరి ఈఈ సస్పెన్షన్


● ఆదాల కంపెనీకి అక్రమంగా బ్యాంకు గ్యారెంటీ వాపస్ ఫలితం

శాఖాపరమైన విచారణకు ఆదేశం ● తాజాగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

తిరుపతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు సంబంధించి తిరుపతి ఎఫ్ఏసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా వ్యవహరిస్తున్న సీహెచ్ హరిబాబును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. నెల్లూరు జిల్లా వైసీపీ నేత ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చెందిన నిర్మాణ కంపెనీకి.. నిబంధనలు ఉల్లంఘించి బ్యాంకు గ్యారెంటీ విడుదల చేసిన కారణంగా ఆయనపై వేటుపడింది. ఈ పథకం కింద కడప జిల్లా నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కాలువ తవ్వాల్సి ఉంది. శేషాచల పర్వతాలు అడ్డుగా ఉన్నందున టన్నెల్ కూడా తవ్వాలి. ఈ పనుల ఇన్వెస్టిగేషన్, డిజైన్లతో పాటు మెయిన్ కెనాల్ 245వ కిలోమీటరు నుంచి 262.100 కిమీ వరకు కాలువ తవ్వకం.. అలాగే 262.100 కిమీ నుంచి 272.800 కిమీ వరకూ బాలాజీ టన్నెల్-2 తవ్వకం, లైనింగ్ పనులకు 2007-08లో నాటి ప్రభుత్వం జలయజ్ఞం కింద టెండర్లు పిలిచింది. ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చెందిన మెస్సర్స్ ఏపీఆర్‌సీఎల్-సీఆర్ఎస్ఎస్‌జీ (జేవీ) హైదరాబాద్ కంపెనీకి టెండర్లు ఖరారయ్యాయి. ప్రభుత్వం ఆ కంపెనీకి మొబిలైజేషన్ అడ్వాన్సు కూడా చెల్లించింది. ఆ పనులకు సంబంధించి ఆ కంపెనీ రూ.1.36 కోట్లు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చింది. ఎంతకాలమైనా పనులు చేపట్టలేదు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు కంపెనీకి నోటీసులు జారీ చేశారు. అడ్వాన్సు తీసుకుని కూడా పనులు చేపట్టనందున తీసుకున్న అడ్వాన్సు మొత్తాన్ని ప్రభుత్వానికి వాపస్ చేయాలని నోటీసుల్లో కోరారు. దీనికి ప్రతిగా కంపెనీ ప్రతినిధులు తమకు సకాలంలో అవసరమైన అనుమతులు, ఆమోదాలు ఇవ్వలేదని, దానివల్ల పనులు చేపట్టలేకపోయామని సమాధానమిచ్చారు. మొబిలైజేషన్ అడ్వాన్సుతో మెషినరీ కొనుగోలు చేశామని, పనులు లేక వాటిని ఖాళీగా పెట్టినందున తామే నష్టపోయామని అందులో పేర్కొన్నారు. అడ్వాన్సు నిధులు పోను ప్రభుత్వమే తమకు అదనంగా సుమారు రూ.91 లక్షలు చెల్లించాలని క్లెయిమ్ చేశారు. అప్పటి నుంచి ఆ వివాదం పెండింగులో ఉంది. కరోనా సమయంలో కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన బాకీలేవైనా ఉంటే వాటికి సరిపడా మాత్రమే బ్యాంకు గ్యారెంటీలు ఉంచుకుని మిగిలిన గ్యారెంటీలను విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దానికనుగుణంగా ఆదాల కంపెనీకి కూడా గాలేరు-నగరి ప్రాజెక్టు ఎస్ఈ, ఈఈ నోటీసులిచ్చారు. అడ్వాన్సు వెనక్కి చెల్లించి బ్యాంకు గ్యారెంటీ వాపస్ తీసుకోవాలని కోరారు. ఆ అధికారులు నిబంధనల ప్రకారం నిక్కచ్చిగా వ్యవహరించడంతో 2022-23లో వారిపై బదిలీ వేటు పడింది. ఆ స్థానంలో హరిబాబును ఎఫ్ఏసీ ఈఈగా నియమించారు. ఆయన వచ్చీ రాగానే ఆదాల కంపెనీకి ప్రభుత్వమే బాకీ పడిందని పేర్కొంటూ కంపెనీకి బ్యాంకు గ్యారెంటీని రిలీజ్ చేసేశారు. ఫలితంగా ప్రభుత్వం చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్సును ఎలా వెనక్కి రాబట్టాలో అంతుబట్టక ఇరిగేషన్ ఉన్నతాధికారులు సతమతమవుతున్నారు. ఈ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు గ్యారెంటీలను విడుదల చేసిన హరిబాబుపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఆ క్రమంలో అతడిని సస్పెండ్ చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.



ఫేషియల్ రికగ్నిషన్ బ్యారియర్ గేట్ ముందు టోకెన్ చూపుతున్న బోర్డు సభ్యులు - కియాస్క్



గంటా, రెండు గంటల్లో స్వామి దర్శనమయ్యేలా..!

ఏఐ సహకారంతో చర్యలు ● తిరుమలలో డెమో ఇచ్చిన ఓ సంస్థ

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు కిలోమీటర్ల పొడవైన క్యూలైన్లలో.. చిన్నపిల్లలు, వృద్ధులతో 20 నుంచి 30 గంటల పాటు నిరీక్షిస్తూ ఆగచాట్లు పడకుండా.. కేవలం గంట నుంచి రెండు గంటల వ్యవధిలోనే తిరుమల వెంకన్న దర్శనం చేయించేందుకు టీటీడీ ధర్మకర్తలమండలి, ఉన్నతాధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో సిబ్బందితో అవసరం లేకుండా టోకెన్ పొందడం, తిరిగి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని ప్రవేశించేందుకు 'ఫేస్ రికగ్నిషన్ ఎంట్రీ' విధానంపై సోమవారం తిరుమలలో ఓ సంస్థ డెమో ఇచ్చింది.

కియాస్క్ ద్వారా టోకెన్

తిరుపతి, తిరుమలలోని పలు కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడ కియాస్క్ యంత్రాలు ఏర్పాటు చేస్తారు. ఆ యంత్రం ముందు నిలబడితే కెమెరా ఆన్ అవుతుంది. ప్రింట్ అనే ఆప్షన్‌ను నొక్కితే ఫేస్‌ను స్కాన్ చేసి దర్శన తేదీ, సమయంతో కూడిన ఓ టోకెన్ ప్రింట్ వస్తుంది.

ఫేషియల్ రికగ్నిషన్ బ్యారియర్ గేట్ ద్వారా ప్రవేశం

టోకెన్ పొందిన భక్తులు తమకు కేటాయించిన సమయానికి పది నిమిషాలు అటుఇటుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు చేరుకోవాలి. అక్కడ ఫేషియల్ రికగ్నిషన్ బ్యారియర్ గేటు ముందు నిలబడితే అక్కడ కూడా కెమెరా ద్వారా ఫేస్ రికగ్నిషన్ ప్రక్రియ జరుగుతుంది. ఓ చిన్నశబ్దం వచ్చాక భక్తుడు ముందుకు వెళ్లేలా గేట్లు ముందుకు కదులుతాయి. ఒకవేళ ఫేస్ రికగ్నిషన్ ప్రక్రియలో లోపం ఉంటే టోకెన్‌ను బ్యారియర్ గేట్‌పై ఉండే ముద్రపై పెడితే కూడా బార్‌కోడ్ స్కాన్ చేసి గేట్లు తెరుచుకుంటాయి. ఈ డెమోను చూసిన అధికారులు పలు సూచనలు చేశారు. మరికొన్ని సంస్థల డెమోను కూడా పరిశీలించనున్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


మామిడి తోటలను పరిశీలిస్తున్న శివకుమారి

భాకరాపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని చిన్నగొట్టిగల్లు ఉద్యాన శాఖాధికారి శివకుమారి అన్నారు. చట్టేవారిపాళెం పంచాయతీలో మామిడి తోటలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నేలలో తేమ శాతం ఎక్కువగా ఉందన్నారు. దీనివల్ల మామిడి పూత రావడానికి ఆలస్యమవుతుందన్నారు. ఒకేసారి పూత రావడానికి లీటరు నీటిలో 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, ఐదు గ్రాముల యూరియా, గ్రాము ఫార్ములా-4ను కలిపి పిచికారి చేయాలన్నారు. తోటలో తేమ త్వరగా ఆరేలా తేలికపాటి దున్నకాలు చేపట్టాలన్నారు. మామిడిరైతులు సలహాలు, సూచనల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖోలో కేజీబీవీ విద్యార్థి ప్రతిభ


మధుశ్రీ

ఎర్రావారిపాలెం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థి మధుశ్రీ రాష్ట్రస్థాయి ఖోఖో ఆటల పోటీలో రజత పతకం సాధించింది. ఈనెల 20 నుంచి 22 వరకు పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ జూనియర్ కాలేజ్‌లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరిగాయి. మండలం నుంచి మధుశ్రీ పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా ఈ విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ పరిమల, ఎమ్మీవో-2 సతీష్ అభినందించారు. జాతీయ స్థాయి క్రీడల అవసమైన సహకారాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. మధుశ్రీని ఉపాధ్యాయులు ప్రశంసించారు.

అన్నదాతల అభివృద్ధికి రాస్ చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరత్నం

భాకరాపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతే దేశానికి వెన్నుముక అని 'రాస్' ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం చిన్నగొట్టిగల్లులో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతు ఆనందంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తమ కేంద్రం ద్వారా తక్కువ ఖర్చుతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే వంగడాలను పరిచయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 'రాస్' పీడీ నాగరాజు, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు, సిబ్బంది సీవీ నాయుడు, భార్గవి, నాగేశ్వర రావు, వనజ పాల్గొన్నారు.

పదిపుట్లబైలు రిజర్వాయర్‌కు జలహారతి


జలహారతి ఇచ్చి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు పదిపుట్లబైలు రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండి జలకళ సంతరించుకుంది. సోమవారం ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి రిజర్వాయర్‌ను సందర్శించారు. జలహారతి ఇచ్చి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, కె.సావిత్రి, నరసింహయాదవ్, సుబ్రమణ్యయాదవ్, దాము తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా క్రిస్మస్ ముందస్తు వేడుకలు



పాఠశాల క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

పాకాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్‌ఫెంట్ జీసస్ పాఠశాలలో సోమవారం చిన్నారులు ముందస్తు క్రిస్మస్ వేడుకలు కోలాహలంగా జరుపుకున్నారు. ఉదయం పాఠశాలలో ఆయా తరగతుల పిల్లలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు. క్రిస్మస్ ట్రీ అలంకరణలు ఆకట్టుకున్నాయి. సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం రాత్రి చిన్నారులు ముందస్తు వేడుకలు జరుపుకున్నారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా మండలంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. ఫాదర్ ఆంతోనిరాజ్, పాస్టర్ ప్రేమ్ కుమార్, సీఎస్ఐ కార్యదర్శి విక్టర్ రాఘవేలు, ట్రెజరర్ అరుళ్ సెల్వి పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 65 వినతులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 65 వినతులు వచ్చాయి. కొన్ని సమస్యలను వెంలనే పరిష్కరించారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, ఎస్పీ డీఎస్పీ గిరిధర్, సీఐ శ్రీనివాసులు తదితరులు వినతులు స్వీకరించారు.

రైతు నాంచారమ్మకు పుడమిపుత్ర అవార్డు



అవార్డు అందుకుంటున్న నాంచారమ్మ

పాకాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గానుగపెంట పంచాయతీ శ్రీరామపురానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు తోట నాంచారమ్మ పుడమి మిత్ర అవార్డు అందుకున్నారు. మామిడి తోటలో అంతర్‌పంటగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వేరువనగ పంట సాగుచేసిందుకు ఈ అవార్డు దక్కింది. జాతీయ గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలి జ్ఞాన ప్రతిష్ఠాన్ సంయుక్త ఆధ్వర్యంలో యాదగిరి గుట్టలో ఆదివారం జరిగిన సదస్సులో అవార్డు అందజేశారు. కన్వీనర్ పావనీరెడ్డి ఆధ్వర్యంలో చైర్మెన్ రాజేందర్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా నాంచారమ్మ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకంతో పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యం పాడవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో తగ్గి నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఆమెను పలువురు అభినందించారు.

సవరణల పేరుతో రాజ్యాంగానికి తూట్లు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి కాంగ్రెస్ నేతలు సవరణల పేరుతో వందకు పైగా తూట్లు పొడిచారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన సోమవారం మాట్లాడుతూ సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు అంబేడ్కర్‌పై ఏ మాత్రమూ ప్రేమ, అభిమానాలు లేవని, ఇప్పుడు కూడా రాజకీయ లబ్ధికోసమే వాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని పదేపదే అవమానించే పార్టీ ఈ రోజు రాజ్యాంగ నిర్మాతకు అవమానం జరిగిందని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.. సమావేశంలో బీజేపీ నేతలు వరప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ట్రాక్టర్ చోరీ నిందితుడు

ఎర్రావారిపాలెం,డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ట్రాక్టర్ల దొంగతనాలకు పాల్పడుతున్న సంఘటనలకు సంబంధించి ఓ నిందితుడిని పోలీసులు పట్టుకొన్నారు. ఇటీవల నాలుగు గ్రామాల్లో ట్రాక్టర్లు, ట్రాలీలు చోరీ అయ్యాయి. ఆగస్టులో బోడేవాండ్లపల్లె కోనేటివారిపల్లెకు చెందిన అమరనాథరెడ్డికి చెందిన ట్రాలీని దొంగిలించారు. ఈనెల 3న వీఆర్ అగ్రహారంలో రఘుకు చెందిన ట్రాక్టరును తీసుకుపోతుండగా దొంగలను గ్రామస్తులు వెంబడించారు. దీంతో అన్నమయ్య జిల్లాలో వాహనాన్ని వదిలిపోయారు. తాజాగా ఈడిగపల్లెకు చెందిన రామచంద్రయ్య ట్రాక్టర్ చోరీ అయింది. ఈ వాహనాన్ని సదుం మండలం పాలమంద గుర్తించారు. అక్కడి రైతుల సాయంతో నిందితుణ్ని పట్టుకొని ట్రాక్టరుతో సహా పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. నిందితుడిని విచారించినట్లు సమాచారం.

నేటి నుంచి ఆధార్ క్యాంపు

భాకరాపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. ప్రత్యేక క్యాంపు మంగళవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు భాకరాపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. చిన్నపిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు చేయడం, పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఆధార్‌లో ఇంటి పేరు, పుట్టిన తేదీల్లో మార్పులు, చేర్పులు వంటిపి చేస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భూ ఆక్రమణయత్నంపై పోలీసులకు ఫిర్యాదు

చంద్రగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తమభూమిని కొందరు ఆక్రమించుకొంటున్నారని, రామచంద్రాపురం మండలం గంగిరెడ్డిపల్లె హరిజనవాడకు చెందిన నాగరాజు,లక్ష్మి దంపతులు సోమవారం సీఐ సుబ్బరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 18-5లో తమ పేరిట ఉందని, 1.04 సెంట్ల భూమి ఉందన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయన్నారు. ఈభూమిలో ఉన్న మామిడిచెట్లను ఓ వ్యక్తి తొలగించి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకున్నామన్నారు. ఈస్థలం ఇద్దరు నాయకుల్లదని జేసీబీ డ్రైవర్ తెలిపారన్నారు. జేసీబీని అడ్డుకొంటే దౌర్జన్యం చేస్తామన్నారని ఆ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయం చేస్తామని సీఐ హామీ ఇచ్చారన్నారు.

వారాహి అమ్మవారి సేవలో ప్రద్యుమ్న దంపతులు



రామచంద్రాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్టపై శక్తిపీఠంలోని వారాహిదేవిని సోమవారం సీఎం ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి పట్టువస్త్రాలను సమర్పించారు. వారిని ఆలయ వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. జేసీ శుభం బన్సల్, డీటీ అన్వర్‌బాషా, ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం తిరుమలలో జరగనుంది. బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు అన్నమయ్య భవనంలో సమావేశం కానున్నారు. దాదాపు 66 అంశాలపై రూపొందించిన అజెండాపై చర్చించనున్నట్టు తెలిసింది. ప్రధానంగా ఆస్పత్రుల నిర్వహణ, టీటీడీ ఆస్తుల పరిరక్షణ, తిరుమలలోని హోటళ్లలో ఆహారపదార్థాల నాణ్యత పెంపుపై తీసుకోవాల్సిన చర్యలు, శ్రీవారికి నగదు, బంగారు పెట్టుబడులపై నిపుణులతో కమిటీ ఏర్పాటు, తిరుమల విజన్-2047, ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ ఏర్పాటుతో పాటు పలు ముడిసరుకుల కొనుగోళ్లపై చర్చించనున్నట్టు సమాచారం.

రెవెన్యూ సదస్సులకు 564 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం జరిగిన 37 రెవెన్యూ సదస్సుల్లో 564 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. వీటిలో 13 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించగా, మిగిలిన వాటిని నిర్ణీత సమయంలోపు పరిష్కరిస్తామన్నారు. ఇప్పటి వరకు రెవెన్యూ సదస్సుల్లో 10,928 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు

నేడు, రేపు డ్రాగన్‌బోట్ ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ కెనాయింగ్, కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాలలో డ్రాగన్‌బోట్(పడవ) ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రాపురం మండలం రాయలచెరువులో మూడు విభాగాలలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు రాయలచెరువు వద్దకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9542034270ను సంప్రదించాలని కోరారు.

ఇంటి తాళాలు పగులకొట్టి బంగారు నగల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి యశోదానగర్‌లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు హైటెక్ పద్ధతిలో చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. టీటీడీ అన్నమాచార్య కళామందిరంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న ఈశ్వరి ఆదివారం ఉదయం శ్రీకాళహస్తికి వెళ్లారు. దీన్ని గమనించిన దొంగలు ఆదివారం అర్ధరాత్రి ఆ ఇంటి ముందున్న సీసీ కెమెరాల వైర్లు కట్ చేశారు. ఇంటి తాళాలు పగులకొట్టారు. పక్క ఇంటివారికి ఎలాంటి అలికిడి లేకుండా అత్యంత జాగ్రత్తగా ఇంట్లోకి వెళ్లారు. బీరువాలు, కప్ బోర్డులు గాలించారు. బీరువాలో భద్రపరచిన 44 గ్రాములు బంగారు నగలు అపహరించుకుని వెళ్లారు. తలుపులు పగులగొట్టి ఉండటాన్ని సోమవారం ఉదయం పక్కింటివారు గమనించి శ్రీకాళహస్తిలో ఉన్న ఈశ్వరికి సమాచారమిచ్చారు. ఆమె అక్కడ్నుంచి వచ్చి ఇంట్లో చూడగా 44 గ్రాముల నగలు చోరీకి గురైనట్లు గుర్తించి అలిపిరి ఎస్ఐ లోకేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు.

భూ బాధితుల న్యాయానికి చర్యలు

● రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పులివర్తి నాని


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన భూఆక్రమణలు, అన్యాయాలను వెలికితీసి బాధితులకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూసదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పులివర్తినానీ తెలిపారు. తుమ్మలగుంటలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆక్రమించుకున్న గ్రామ చెరువువంక పొరంబోకు, కాలువలను యథాస్థితికి తేవాలని గ్రామస్తుల అభ్యర్థనపై ఎమ్మెల్యే స్పందించారు.. వంశపారంపర్యంగా అనుభవం కలిగిన చెరువు మునక భూబాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడుతామన్నారు. యూడీఎస్ ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీకి కేటాయించిన కొత్త ట్రాక్టర్‌ను గ్రామసర్పంచ్ సుబ్బరామిరెడ్డితో కలసి ప్రారంభించారు. నాయకులతో కలసి ట్రాక్టర్ ఎక్కి కొంతదూరం నడిపారు. చెత్త డంపింగ్ యార్డ్‌కి కేటాయించినస్థలాన్ని వారంరోజులలోపు సిద్ధం చేసి అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.డిప్యూటీ కలెక్టర్ రోస్మండ్, తహసీల్దార్ రామాంజులునాయక్, ఎంపీడీవో రామచంద్ర, అధికారులు,టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి

తుమ్మలగుంట బక్కిరెడ్డికాలనీలో ఇళ్ల మధ్యలో భారీగా మురుగునీరు చేరింది. దీంతో స్థానికులు దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు వచ్చిన ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి ఈ సమస్య రావడంతో వెంటనే స్పందించారు. ఫిర్యాదారును వెంటబెట్టుకుని వెళ్లి మురుగునీటిని పరిశీలించారు. తొలగింపునకు సత్వర చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. యూడీఎస్‌లేకపోవడంతో పలుచోట్ల మురుగు నిలిచిపోయి ఇబ్బందిపడుతున్నామని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ముగిసిన తిరుపతి నృత్యోత్సవం


తిరుపతి గంగమ్మ నృత్య రూపకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నృత్యం భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అని పలువురు వక్తలు పేర్కొన్నారు. తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో రెండు రోజులుగా నిర్వహించిన తిరుపతి నృత్యోత్సవం సోమవారం ముగిసింది. శ్రీకృష్ణ నాటరాజాలయం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ముగింపు సభ సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ నృత్యం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. ఏకవీర ఫౌండేషన్ స్థాపకులు ప్రతాప్ స్వామి మాట్లాడుతూ దేశంలో ప్రాచీన కాలం నుంచే అనేక నృత్య రీతులు ఉనికిలో ఉన్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ తరంపై ఉందని అన్నారు. డాలర్స్ గ్రూప్ అధినేత డాలర్ దివాకర్‌రెడ్డి, అయూబ్ ఖాన్ మాట్లాడారు. కేరళకు చెందిన భజన సురేంద్రనాథ్ బృందం ప్రదర్శించిన మోహిని అట్టం, జార్ఖండ్‌కు చెందిన తారిత్ సర్కార్ ప్రదర్శించిన కథక్ నృత్యం కళాకారులకు శ్రీకృష్ణ నృత్య పారిజాత పురస్కారాలను ప్రదానం చేశారు. తిరుపతికి చెందిన కళాకారులు ప్రదర్శించిన గంగజాతర కళా రూపకం అదరహో అనిపించింది. కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం, పేరణి నృత్యం, కథక్, మోహినీ అట్టం వంటి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. నిర్వాహకులు కొండారవి, సత్యనారాయణ, సాయినాథ్, ఇరుముని శేఖర్, యువరాజ్, సురేష్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల వేదికకు 32 అర్జీలు


అర్జీదారుతోమాట్లాడుతున్న అదనపు కమిషనర్

తిరుపతి, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 32 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. కొర్లగుంటలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, ప్రజలకు వైద్య పరీక్షలు చేయించాలని కోరారు. ప్రభుత్వ ఇంటి కోసం తీసుకున్న డబ్బు తిరిగి ఇప్పించాలని, టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, డీకేటీ స్థలంలోని కాలువపై అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని నిలుపుదల చేయాలని, సుబ్బారెడ్డి నగర్‌లో గుంత పూడ్చాలని, గొల్లవానిగుంట, రాజీవ్ నగర్‌లో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, గరుడ వారధి పిల్లర్ నంబరు 24 వద్ద గుంత పూడ్చాలని, పాత రేణిగుంట రోడ్డు రిలయన్స్ మార్ట్ వద్ద చెత్త వేస్తున్నారని, నివారించి శుభ్రంగా ఉంచాలని కోరారు. అధికారులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఘనంగా రైతు దినోత్సవం


సన్మానం పొందిన రైతులతో జయప్రకాశ్, కిశోర్‌బాబు

తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్య స్కూల్‌లో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతులు శ్రీధర్, పురుషోత్తమనాయుడు, రెడ్డెప్పను సన్మానించారు. ఏజీఎం సురేష్ మాట్లాడుతూ.. రైతులు దేశానికి వెన్నెముక లాంటివారని, వారి సేవలను గుర్తించి.. గౌరవించడం సామాజిక బాధ్యతని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ జయప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు, కోఆర్డినేటర్ బాలాజి, డీన్ సురేష్, సీఅండ్ఎం ఇన్‌చార్జి నరేంద్రబాబు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారికి శిక్ష తప్పదు : నరసింహయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని అప్పటి పాలకులు అవినీతికి పాల్పడ్డారని, అలాంటి వారికి శిక్ష తప్పదని టీడీపీ తిరుపతి పార్లమెంటు డివిజన్ అధ్యక్షుడు గొల్ల నరసింహయాదవ్ స్పష్టం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు తుడా పరిధిలో రూ.250 కోట్లకు పైగా నిధులను దుర్వినియోగం చేశారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిని శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేషన్ బియ్యాన్ని సైతం విక్రయించుకున్న మాజీ మంత్రి రోజా, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఈ రోజు అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో మనోహరాచారి, చందన స్రవంతి, రవిశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

ఈ తరం వ్యవసాయం పట్ల ఆసక్తి చూపాలి



సభలో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం పట్ల ఈ తరం ఆసక్తి చూపాలని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సూచించారు. రైతు దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ బొటానికల్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించి ఆరోగ్యకరమైన జీవిత విధానాన్ని అలవరుచుకోవాలని కోరారు. విద్యాధికులే వ్యవసాయదారులుగా మారి భవిష్యత్తులో అధిక దిగుబడి సాధించేలా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతులను అనుసించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, బోటనీ హెడ్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

జ్ఞాన మార్గంలో నడిపించేది పాంచరాత్రమే


శ్రీనివాసాచార్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సర్వజనులకూ మోక్షాన్ని చూపేది పాంచరాత్రమేనని తిరుచానూరు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఏడు రోజుల పాటు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే పాంచరాత్రాగమ ఉత్సవాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పాంచరాత్రాగమానికి మోక్ష ధర్మమని ప్రసిద్ధి ఉందన్నారు. సాక్ష్యాత్తూ శ్రీమన్నారాయణుడి చేత ఉపదేశించినదిగా పేరు ఉందన్నారు. దీక్ష సిద్ధాంతం, ఉపాసన, ధ్యానం, యోగం వంటి విశిష్ట విషయాల సమాహారమే పాంచరాత్రాగమమని తెలిపారు. సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యాపీఠంలో 30 ఏళ్ల క్రితమే ఆగమ విభాగం ఏర్పడిందన్నారు. తద్వారా ఆగమ గ్రంథాల ప్రచురణ, సదస్సులు, చర్చాగోష్ఠుల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆచార్య వేదాంతం విష్ణుభట్టాచార్యులు, డాక్టర్ రంగరామానుజాచార్యులు, పాంచరాత్రాగమ విద్వాంసులు భరతశేఖరాచార్యులు, రాఘవాచార్యులు, సంపత్కుమారాచార్యులు, అర్చకం మణికంఠ భట్టాచార్యులు పాల్గొన్నారు.

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి పేర్కొన్నారు. నవ సమాజ గిరిజన విద్యార్థి ఫెడరేషన్ మూడవ వార్షికోత్సవం ఎస్వీయూ సెనేట్ హాల్లో సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గిరిజనులు నేటికీ ప్రకృతికి, సంప్రదాయాలకు, సహజత్వానికి దగ్గరగా జీవిస్తున్నారని తెలిపారు. మన ఆచార, సంప్రదాయాలు, కళలను కాపాడుకుంటున్నారని చెప్పారు. నవ సమాజ గిరిజన విద్యార్థి ఫెడరేషన్ నాయకులు శివశంకర్ నాయక్ మాట్లాడుతూ గిరిజన విద్య, ప్రజా సమస్యల పరిష్కారానికి కొన్నేళ్లుగా నిరంతర పోరాటం చేస్తున్నట్టు తెలిపారు

పద్మావతి వర్సిటీ ఉన్నత గుర్తింపునకు కృషి



వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపును సాధించేందుకు కృషి చేస్తామని ఆ వర్సిటీ వీసీ ఉమ పేర్కొన్నారు. పీఎం-ఉష ప్రాజెక్టు ద్వారా యూనివర్సిటీకి ర్యాంకింగ్స్, గుర్తింపును తెచ్చేందుకు అవసరమైన కార్యక్రమాలపై సోమవారం సావేరి హాల్లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరానికి 100 లోపు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు పొందేందుకు ప్రయత్నం జరగాలన్నారు. ఉన్నత గుర్తింపు ద్వారానే దేశంలోని అన్ని విద్యాసంస్థలకు నిధుల కేటాయింపు ఉంటుందన్నారు. ఇందుకు అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. ర్యాంకింగ్స్ కో-ఆర్డినేటర్ వెంకటకృష్ణ, విట్ ప్రొఫెసర్ రాజశేఖరబాబు, డీన్ వాణి పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘన నివాళి అర్పించారు. రాములవారి దక్షిణ మాడ వీధిలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ తరం రాజకీయవేత్తలకు పీవీ నరసింహారావు జీవితం ఆదర్శప్రాయమని ఆ సంస్థ నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో చిత్రపు హనుమంతరావు పాల్గొన్నారు.


క్రిస్మస్ పండుగ సందర్భంగా విద్యుత్ అలంకరణలో తిరుపతి వెస్ట్ చర్చి

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం


ఈఈ చంద్రశేఖర రావు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తామని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్, కరకంబాడీ, తోళప్ప గార్డన్, ఇస్కాన్, ఆర్డీవో కార్యాలయ ప్రాంతం, ఎలమండ్యం ప్రాంతాల్లోని వినియోగ దారులతో ఆయన సమావేశమయ్యారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఎటువంటి సమస్యలనైనా అధికారుల దృష్టికి తీసుకొస్తే అక్కడికక్కడే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈఈలు అంజనేయులు, రమేష్, ఏఈలు పుణ్యకోటి, హరిప్రసాద్, ఎల్వీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో రూ.6.66 లక్షలు చెల్లించండి

● తీర్పునిచ్చిన న్యాయస్థానం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్సు కేసులో ఫిర్యాదుదారుడికి నెలలోపు రూ.6.66 లక్షలు చెల్లించాలని తిరుపతి ఆరవ అదనపు ప్రత్యేక న్యాయమూర్తి రాణాప్రతాప్ సోమవారం తీర్పు చెప్పారు. సుబ్బారెడ్డినగర్‌కు చెందిన హరిప్రసాద్ వద్ద.. టీటీడీ వినాయకనగర్‌లోని సీ.టైపు క్వార్టర్సులో ఉన్న సుబ్రమ్మణ్యం 2016లో రూ.3.60లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీనికి సంబంధించి 2019లో రూ.4.46లక్షలకు చెక్ ఇచ్చాడు. చెక్ బౌన్సు అయింది. దీనిపై ఫిర్యాదుదారుడు కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశాడు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి రాణాప్రతాప్ నెల రోజుల్లోపు ఫిర్యాదుదారునికి 6.66 లక్షలు చెల్లించాలని లేకుంటే ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పునిచ్చారు.

ఖోఖో పోటీల్లో మంగళం విద్యార్థిని ప్రతిభ


ప్రత్యూష

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలలో మంగళం ట్రెండ్స్ కళాశాల విద్యార్థిని డి.ప్రత్యూష ప్రతిభ కనబరిచింది. ఖోఖో క్రీడాంశంలో రన్నరప్‌గా నిలిచి బ్రాంజ్‌మెడల్ సాధించింది. సోమవారం పాఠశాల ఆవరణలో హెచ్ఎం కేశవులనాయుడు ఆధ్వర్యంలో ఆమెను సన్మానించి, అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి విశిష్ట పురస్కారం


సన్మానం అందుకుంటున్న సుబ్రమణ్యం

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ కార్యక్రమంలో మంగళం డిపో ఆర్టీసీ ఉద్యోగి గుండ్లూరు సుబ్రహ్మణ్యంకు విశిష్ట పురస్కారం లభించింది. ఆదివారం విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ రంగాలలో నిష్ణాతులైన కళాకారులను ఆహ్వానించి వారి మేధస్సును పరీక్షించారు. సుబ్రహ్మణ్యం విజయవాడ బుడమలేరు వరద గురించి, ఆ సమయంలో ప్రజల సాధకబాధలను రచించి ఆలపించారు. ఆయన ప్రతిభను గుర్తించి తెలుగుబుక్ ఆఫ్ రికార్డు జ్ఞాపికను బహూకరించి, సత్కరించారు. తెలుగు కళారత్నాల సాంస్కృతిక సేవా సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యు.వి.రత్నం, కన్వీనర్ డాక్టర్ డి.ఉషారాణి, తెలుగు శాఖాధిపతి డాక్టర్ బాల చందర్, డాక్టర్ చివుకుల సాంబశివరావు పాల్గొన్నారు.

గీతంలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు



తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): భవానీనగర్‌లోని గీతం స్కూల్‌లో సోమవారం ముందస్తు క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. పలువురు చిన్నారులు క్రిస్మస్ తాత వేషధారణతో అలరించారు. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా వచ్చిన మిమిక్రీ కళాకారుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ మతాలకతీతంగా ఐక్యతను చాటేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రతిభచాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ పాలడుగు విజయ, ప్రిన్సిపాల్ కిన్నెర శ్రీదేవి పాల్గొన్నారు.

పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్‌కు జాతీయ అవార్డులు



తిరుపతి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంబంధాల వ్యాప్తి కోసం ఉత్తమ కార్యక్రమాలు నిర్వహించినందుకు పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్‌కు జాతీయ స్థాయిలో రెండు అవార్డులు లభించాయి. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లోని బాబిలోన్ ఇంటర్నేషనల్ హోటల్లో సోమవారం జరిగిన 46వ జాతీయ ప్రజాసంబంధాల సదస్సులో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అరుణ్‌సావో చేతుల మీదుగా తిరుపతి చాప్టర్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్రమోహన్ ఈ అవార్డును అందుకున్నారు. అలాగే ప్రజాసంబంధాల వ్యాప్తిలో విశిష్ట సేవలు అందించినందుకు ప్రత్యేకంగా శ్రీనివాసరావుకు అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ అవార్డు లభించింది. కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్‌పాథక్, ఉపాధ్యక్షుడు యూఎస్.శర్మ, ప్రధాన కార్యదర్శి పి.ఎల్.కె.మూర్తి పాల్గొన్నారు. అవార్డు ప్రదానం పట్ల టీటీడీ చీఫ్ పీఆర్వో డాక్టర్.టి.రవి పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ కార్యవర్గాన్ని అభినందించారు.

కూలీలను పర్మినెంట్ చేయాలి

తిరుపతి(లీలామహల్): తిరుమలలో గార్డెన్ డిపార్ట్‌మెంట్‌లో 15 ఏళ్లుగా పనిచేస్తున్న 126 మంది కూలీలను పర్మినెంట్ చేయాలని తిరుపతి స్థానిక హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

శ్మశాన సమస్యను పరిష్కరిస్తాం


ఎమ్మెల్యే ఎదుట టీడీపీ నేతలు, వైసీపీ కార్పొరేటర్ మధ్య వాగ్వాదం

తిరుపతి(జీవకోన), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిమ్మినాయుడుపాలెం హరిజనవాడ శ్మశాన సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం కరకంబాడీ రోడ్డులోని తిరుమల రెడ్డినగర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 22ఏ, టీడీఆర్ బాండ్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీఎన్‌పాలెం హరిజనవాడకు చెందిన టీడీపీ నేత కాయం వెంకటరత్నం గ్రామస్తులతో కలిసి శ్మశాన స్థల విషయమై ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చారు. అదే సమయంలో 50వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ అనిల్ అక్కడికి చేరు కున్నారు. శ్మశానానికి అటవీ స్థలం కేటాయిం చాలా లేదా ఇప్పుడున్న స్థలాన్నే కొనసాగిం చాలా అనే విషయమై ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం పెరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్య తెలియజేయాలని, ఇష్టానుసారంగా వచ్చి మాట్లా డటం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లా డుతూ గత వైసీపీ ప్రభుత్వంలో భూముల వ్యవహారంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిం చారని, కూటమి ప్రభుత్వం ప్రజలకు న్యాయం చేస్తుందని అన్నారు. ఆర్డీవో రామమోహన్ మాట్లా డుతూ అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరి స్తామన్నారు. టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, అర్బన్ తహసీల్దార్ భాగ్య లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రయ్య, ఆర్ఐ కృష్ణమ్మ, వీఆర్వో వెంకటాచలపతి, క్లస్టర్ ఇన్‌చార్జి బి.జి.కృష్ణయాదవ్, టీడీపీ నేతలు పులిగోరు మురళీ కృష్ణారెడ్డి, కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, మన్నెం శ్రీనివాసులు, రవిశేఖర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, ధోని, జనసేన నేతలు వంశీ పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సేవా సమితి(రాస్) సేవా నిలయంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఆయన మాట్లాడుతూ రైతు సంతోషంగా ఉంటే దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం పాడి పరిశ్రమ అభివృద్ధికి 140 మంది రైతులకు రూ.కోటీ పది లక్షల చెక్కులను అందించారు. రాస్ కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విభిన్న ప్రతిభావంతురాలు లక్ష్మమ్మకు మూడు చక్రాల సైకిల్‌ను అంద జేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, వాణి, భార్గవి, వనజ, నాగేశ్వరరావు, పులిచెర్ల, చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల, ఎర్రావారిపాళెం రైతులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పదవికి రాజీనామా చేసి విమర్శించాలి

తిరుపతి(వైద్యం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీని విమర్శించే ముందు ఆ పార్టీ పేరుతో వచ్చిన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేయాలని టౌన్‌బ్యాంక్ వైస్ ఛైర్మన్ వాసుదేవయాదవ్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ గుర్తుపై గెలిచిన అనితా యాదవ్ ఇప్పుడు ఆ విషయాన్ని మర్చిపోయి విమర్శించడం సరికాదన్నారు. జీవకోనకు వేసిన వంద మీటర్ల రోడ్డును ఎందుకు పెండింగ్‌లో పెట్టాల్సి వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో పెండింగ్ రోడ్డును పూర్తి చేయించగలరా అని ప్రశ్నించారు. సమావేశంలో వైసీపీ నేతలు బత్తల అరుణ్‌యాదవ్, బ్రహ్మానందం, చింతా రమేష్, అశోక్ పాల్గొన్నారు.



పట్టించుకోండి సారూ..!



మంగళం బీసీఎం పాఠశాలకు పక్కనే ఉన్న బస్సు షెల్టర్ కూలడానికి సిద్ధంగా ఉంది. 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ షెల్టర్ తప్పుపట్టి శిథిలావస్థకు చేరుకుంది. వ్యర్థాలు, తడిచెత్త పడేస్తుండడంతో స్తంభాల అడుగుభాగం బాగా దెబ్బతింది. తుపాన్ ప్రభావంతో వీచిన గాలులకు కాస్త వంగిపోయింది. ప్రమాదం జరగముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)



మధురానగర్‌లోని రైల్వే కాలనీకి వెళ్లే రోడ్డులో మురుగునీరు పరుగులు పెడుతోంది. జనం, వాహనదారులు వాటిని తొక్కుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. డ్రైనేజీలు చెత్తతో పూడిపోవడంతో నీరు రోడ్డుపైకి వస్తోంది. రెండు వారాలుగా మున్సిపల్ కమిషనర్‌కు పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేసినా లాభం లేకపోయిందని స్థానిక మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), (ఆంధ్రజ్యోతి)

చెన్నైకు పాదయాత్ర



తిరుపతి(లీలామహల్), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు, సేవకుడు రాఘవ లారెన్స్‌ను కలవడానికి కదిరికి చెందిన పవన్‌కల్యాణ్ తిరుపతి నుంచి చెన్నైకి పాదయాత్ర చేపట్టాడు. సోమవారం సాయంత్రం అలిపిరి మెట్ల వద్ద వెంకటేశ్వర స్వామికి పూజలు చేసి, యాత్ర ప్రారంభించాడు. లారెన్స్‌పై అభిమానంతో సైకిల్‌పై హైదరాబాదు నుంచి సొంత ఊరు కదిరి చేరుకున్నానని తెలిపాడు. ఇప్పుడు తిరుపతి నుంచి చెన్నైకు పాదయాత్రగా వెళ్తున్నట్లు చెప్పారు.







వ్యభిచార నిర్వాహకురాలి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం సత్యనారాయణపురంలో వ్యభిచారం చేయిస్తున్న నిర్వాహకురాలు కుమారిని సోమవారం రాత్రి అరెస్టు చేసినట్లు అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

26న పెన్షనర్స్ సమావేశం

తిరుపతి(ఆటోనగర్), నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కార్యవర్గ సమావేశం, రాష్ట్ర కార్యవర్గ సమావేశం తిరుమల బైపాస్ రోడ్డులోని శ్రీకాళహస్తీశ్వర ఆర్యవైశ్య వాసవీ సత్రంలో ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఏపీ సర్కిల్ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల వేతన సవరణ, పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో మంత్రి, న్యాయమూర్తులు



మంత్రి పార్థసారథి - జస్టిస్ భవాని సుబ్బరాయన్



జస్టిస్ కృష్ణకుమార్




జస్టిస్ అనిల్‌వర్మ



జస్టిస్ సంతోష్

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో..మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవాని సుబ్బరాయన్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిల్‌వర్మ, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంతోష్, ఎంపీ గురుమూర్తి ఉన్నారు. వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర మంత్రి పార్థసారథి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

హుండీ ద్వారా రూ.4.12 కోట్లు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 7 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం : రూ.4.12 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 77,260

తలనీలాలు సమర్పించినవారు : 24,223



ఎగ్జైట్‌మెంటిచ్చే ఎక్జోటిక్ పార్క్!





పంచరంగుల చిలుకమ్మలు మీ భుజాలమీద వాలుతాయి. చేతి మీద నిలబడి కబుర్లు చెబుతాయి. కొండచిలువలను మెడ చుట్టూ వేసుకుని సెల్ఫీ దిగచ్చు. ఊసరవెల్లులు, విచిత్రమైన అతి పెద్ద తొండలతో ఆడుకోవచ్చు. ఎడారి ఒంటె మీద ఎక్కి చక్కర్లు కొట్టచ్చు. రంగురంగుల చేపలు ఈదులాడే అక్వేరియంను వీక్షించవచ్చు. తిరుపతిలో ఇటీవలే ప్రారంభించిన 'ఏటూ జెడ్ ఎక్జోటిక్ పార్క్'లో ఈ వింత విశేషాలు అందుబాటులోకి వచ్చాయి. మంగళం రోడ్డులో ఆశా కన్వెన్షన్ సెంటర్ పక్కనే ఈపార్క్ ఉంది. చిట్టిపొట్టి విచిత్ర మేకలు.. గుర్రాలు.. గినీ పిగ్స్.. అరుదైన టర్కీ కోళ్లు, అడవి కోళ్లు, కుందేళ్లు, ఉడుములు, ముంగిసలు.. ఇలా ఎన్నోరకాల ఫ్రెండ్లీ పెట్స్‌తో సందర్శకులు సన్నిహితంగా ఉండచ్చు. పెట్స్ పెంపకంలో దాదాపు ఇరవై ఏళ్ల అనుభవం ఉన్న హర్షవర్ధన్ ఒకటిన్నర ఎకరాల స్థలంలో అరుదైన పక్షి, జంతుజాతులతో ఈ మినీ జూపార్క్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రవేశ రుసుము 100 రూపాయలు.

పెట్స్‌పై అవగాహన కోసం

ప్రకృతికి దగ్గరగా ఉన్న అనుభూతిని కలిగించేందుకు ఈ పార్క్ ఏర్పాటు చేశాం. విద్యార్థులకు పక్షి, జంతుజాతుల గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇక్కడ ఉన్న కొన్ని పక్షులను కొనుగోలు చేశాం. ఎక్కువగా దత్తత వచ్చినవే ఉన్నాయి. ఒంటెను నెల్లూరు దగ్గర కాపాడి తీసుకొచ్చాం. ఎవరైనా పెంచుకోవాలని అనుకుంటే బ్రీడ్ అయిన జాతులను ఉచితంగా ఇవ్వాలనుకుంటున్నాం. జనవరి నుంచి దత్తత ఇవ్వడం ప్రారంభిస్తాం.

- హర్షవర్ధన్, ఎక్జోటిక్ పార్క్ నిర్వాహకుడు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనుల పరిశీలన



వాటర్ ట్రీట్‌మెంట్ ట్యాంక్‌పై చర్చిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేరసానిపల్లె పంచాయతీ గుండ్లగుట్టపల్లె వద్ద నిర్మిస్తున్న వాటర్ ట్రీట్ మెంట్ ట్యాంక్‌ను చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం సందర్శించారు. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి గుండ్లగుట్టపల్లె వాటర్ ట్రీట్‌మెంట్ ట్యాంక్‌కు నీరు చేరుతుంది. ట్యాంకులో నీటిని శుద్ధి చేశాక పైపులైన్ ద్వారా చిత్తూరు ఎన్టీఆర్ జలాశయానికి పంపడానికి పనులు చేపట్టారు. ఐదేళ్లుగా పాలకులు, అధికారులు నిర్లక్ష్య వైఖరితో పనులు నిలిచిపోయినట్లు గుర్తించారు. ట్రీట్‌మెంట్ ట్యాంక్‌కు స్థలం ఇచ్చిన రైతులకు మరింత నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి టెండర్ల ద్వారా పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్టీఆర్ జలాశయానికి పంపే నీటిలో ఎమ్మెల్యే అభ్యర్థిన మేరకు 0.2 టీఎంసీలను పాకాల మండల చెరువులకు కేటాయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ట్యాంకుపనులపై చర్చించారు. ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, డీఈ రెడ్డి సురేష్, చిత్తూరు పబ్లిక్ హెల్త్ డీఈ నాయక్, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ - ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, వారి సమస్యలు వింటున్న అధికారులు

పీజీఆర్ఎస్‌కు 243 వినతులు

కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 243 వినతులు వచ్చాయి. అందులో భూ సమస్యలపై అత్యధికంగా రెవెన్యూ శాఖకు 153 ఉన్నాయి. కాగా, పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ పలు కీలక మార్పులు చేశారు. గతంలో టోకెన్ కలిగిన అర్జీదారుడు పీజీఆర్ఎస్ వేదిక వద్దకు వెళ్లి కలెక్టర్‌కు లేదా జేసీకి, ఇతర అధికారులకు అర్జీలు అందజేసేవారు. అయితే ప్రతి అర్జీదారుడి సమస్యను సావధానంగా తెలుసుకునేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. అన్ని శాఖల హెచ్ఓడీలను కౌంటర్ల వద్ద కూర్చోబెట్టి అర్జీదారుల సమస్యలు వినే విధంగా చర్యలు తీసుకున్నారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సులు, సీఎంవో, ఆన్‌లైన్‌లో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకీ బాధ్యతాయుతంగా పరిష్కారం చూపాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌పై జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మండల అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల్లో ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పారదర్శకంగా పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ఉపసంహరించుకోవాలి

● కేంద్ర ప్రభుత్వానికి రైతు సంఘాల అల్టిమేటం ● కేంద్ర ప్రభుత్వ జీవోను దహనం చేసిన నేతలు ● పోలీసులు, నేతల మధ్య వాగ్వాదం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెట్(ప్రైవేటీకరణ) విధానం ఉపసంహరించుకోవాలని, దీనిపై పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత ధోరణిని విడనాడాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతు సంఘాల పిలుపు మేరకు వ్యవసాయ మార్కెట్ ప్రైవేటీకరణ కోసం తీసుకువచ్చిన జీవోను సోమవారం కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల నేతలు దగ్ధం చేశారు. పోలీసులు ఆపేందుకు ప్రయత్నించడంతో తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు, నిరసనకారుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య సలహాదారుడు (సీఐఎఫ్ఏ) మాంగాటి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలన్నారు. మూడు నల్ల చట్టాలు రద్దు చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ దొడ్డిదారిన జాతీయ మార్కెట్ విధానాన్ని తీసుకువచ్చి రైతులను మోసం చేశారని దుయ్యబట్టారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి రామిశెట్టి వెంకయ్య మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర ఇవ్వాలని ఢిల్లీ సరిహద్దులో పోరాటం చేస్తున్న వారిని అణిచివేయాలని చూస్తే సహించమన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్నలతో కంటనీరు పెట్టించడం సరి కాదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా పోరాటం చేస్తున్న వారిపై కేసులు పెట్టి, జైల్లో వేయడం దుర్మార్గపు చర్య అన్నారు. అనంతరం జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు జల్లా విశ్వనాథ్, ప్రజా సంఘాల నాయకులు పాటూరి వెంకటరత్నం, శివారెడ్డి, బండి చలపతి, ప్రవీణ్, శివ, మణి, పద్మనాభం, అల్లాబాషా, మునీశ్వర్, చందు నాయక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జీవో ప్రతులను దహనం చేయగా.. మంటలు ఆర్పుతున్న పోలీసు కానిస్టేబుల్

వరకట్న వేధింపులకు వివాహిత బలి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన వినాయకనగర్ క్వార్టర్స్‌లో సోమవారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా కలికిరికి చెందిన వీ గణేష్, కేవీపల్లికి చెందిన కే పార్వతమ్మ(27) మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. గణేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. పార్వతమ్మ టీటీడీ పరిధిలోని పద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుగా పనిచేస్తోంది. పుట్టింటి నుంచి డబ్బు తీసుకురావాలంటూ కొన్ని రోజులుగా గణేష్ పార్వతమ్మపై ఒత్తిడి తేవడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై ఇద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. ఆదివారం గొడవ తారస్థాయికి చేరడంతో ఘర్షణపడ్డారు. మనస్తాపానికి గురైన పార్వతమ్మ అందరూ నిద్రించిన తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అలిపిరి పోలీసులు పార్వతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి నిందితుడు గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,716మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,703మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 1,951మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 720, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 259మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 230మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 86మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,879 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

తిరుమలేశుని సేవలో భండారకేరి మఠాధిపతి

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉడిపిలోని భండారకేరి మఠాధిపతి విద్యేశతీర్థ స్వామి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో శిష్యబృందంతో ఆలయం మహద్వారం వద్దకు చేరుకున్న స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ అర్చక బృందం స్వాగతం పలికారు.

స్థానికులకు జనవరి7న దర్శనానికి 5న టోకెన్ల జారీ

తిరుమల, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): జనవరి 7న తిరుమల దర్శనానికి స్థానికులకు టోకెన్‌లను జనవరి 5న విడుదల చేయనున్నారు. టీటీడీ బోర్డులో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతినెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జనవరి 5న తిరుపతి మహతి ఆడిటోరియంలో, తిరుమల బాలాజీనగర్‌లో శ్రీవారి దర్శన టికెన్లు జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమలలోని స్థానికులు దర్శనానికి అర్హులు. ఒరిజనల్ ఆధార్‌కార్డు చూపించి టోకెన్లు పొందవచ్చు.

12న జాతీయ యువజనోత్సవం

తిరుపతి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతి సందర్భంగా వచ్చే నెల 12వ తేదీన జాతీయ యువజనోత్సవం నిర్వహిస్తున్నట్లు సెట్విన్ ఇన్‌చార్జ్ సీఈవో మోహన్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మొదటి వారంలో యువతీయువకులకు పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 16 నుంచి 29 సంవత్సరాల లోపు వారు అర్హులని తెలిపారు. వచ్చే నెల 5వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 0877-2286921, 9440573537, 7036428762లను సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● భర్త మృతి, భార్య పరిస్థితి విషమం





మృతి చెందిన బాలాజీ - గాయపడిన మాధవి

చంద్రగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎం.కొత్తపల్లి సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకు చెందిన బాలాజీ(37), భార్యతో కలసి ద్విచక్ర వాహనంపై చిత్తూరు నుంచి తిరుచానూరు వస్తున్నారు. ఎం.కొత్తపల్లి సమీపంలోకి రాగానే చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న కారు వీరి వాహనాన్ని ఢీ కొంది. ఈప్రమాదంలో బాలాజీకి భార్య తీవ్ర గాయాలవ్వడంతోఅక్కడిక్కడే మృతి చెందాడు. భార్యను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ ఉద్యోగి మృతి



చెంచునాథ్ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందాడు. శ్రీకాళహస్తి పట్టణం ఎంఎంవాడకు చెందిన చెంచునాథ్(40) అలియాస్ ఖాన్ పట్టణ శివార్లలోని రాజీవ్‌నగర్ ప్రాంతంలో పురపాలక సంఘం ద్వారా నీరు విడుదల చేసే విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తుండేవాడు. సోమవారం సాయంత్రం రాజీవ్‌నగర్ వాటర్ ప్లాంట్ వద్ద విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో రాజీవ్‌నగర్ సమీపంలోని పిచ్చాటూరు రహదారిపై ఆటో ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చెంచునాథ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

శ్రీవారి సేవకుడితో ఉద్యోగి బూతుల దండకం

తిరుమల, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సన్నిధిలో ఒక ఉద్యోగి బూతులు మాట్లాడుతూ తనతో దురుసుగా ప్రవర్తించాడని శ్రీవారి సేవకు వచ్చిన ఒక భక్తుడు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం వేకువజామున సేవ పూర్తిచేసుకుని శ్రీవారిని దర్శించుకుని వెలుపలకు వస్తున్నపుడు పంచె కాళ్లకు తగలడంతో తను కిందకు వంగానని, అక్కడే విధులు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగి ఒకరు చెప్పుకోలేని పదాలతో బూతులు తిట్టాడని గుంతకల్‌కి చెందిన టీవీ లోకనాథం ఆరోపించారు. పవిత్రమైన స్వామి సన్నిధిలో ఇలా బూతులు మాట్లాడటమేమిటని ఆవేదన వ్యక్తం చేశారు ఈమేరకు ఆయన సేవా విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించిన అనంతరం ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. కాగా టీటీడీ ఉద్యోగులు శ్రీవారిసేవకులను చులకనగా మాట్లాడుతున్నారంటూ డయల్‌యువర్ ఈవో కార్యక్రమంలో కూడా గతంలో కొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ నేతల పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి(జీవకోన), డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): కరెంటు చార్జీలు పెంచేశారంటూ వైసీపీ చేపట్టిన పోరుబాట పోస్టర్‌ను సోమవారం తిరుపతిలో ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. పెరిగిన విద్యుత్తు చార్జీలపై ఈనెల 27వ తేదీ ఆయా విద్యుత్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. ఇందుకోసం ప్రజలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయరెడ్డి, నాయకులు అజయ్‌కుమార్, ఆంజనేయులు, నల్లనిబాబు, ఇమ్రాన్, అనిల్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో బాధ్యతల స్వీకరణ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ బాలకృష్ణ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నగరి ఏరియా ఆస్పత్రిలో సీఎస్ఆర్ఎంవోగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ నాయక్‌ను ప్రభుత్వం డీఎంహెచ్‌వోగా నియమిస్తూ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఆయన సోమవారం తిరుపతిలోని డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ మైదానం పరిశీలన



పక్షుల పండుగ జరిగే మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నేతలు సుధాకర్ రెడ్డి, రమేష్, మాధవ నాయుడు, కిషోర్

సూళ్లూరుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించే జూనియర్ కళాశాల మైదానాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సోమవారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా పక్షుల పండుగను నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పక్షుల పండుగ జరిగే మైదానాన్ని చదును చేయడంతో పాటు మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, బండారు ఆంజనేయులు, మేడా సాయి నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గొల్లపల్లి ఆలయ భూమి
పాసు పుస్తకానికి దరఖాస్తు

పుత్తూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి దేవాలయ మాన్యానికి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని ఆలయ చైర్మన్, ఆలయ ఈవో రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇచ్చారు. మండలంలో రెవెన్యూ సదస్సులు కె.ఎం.అగ్రహారం, గొల్లపల్లిలో నిర్వహించారు. కె.ఎం.అగ్రహారంలో జాతీయ రహదారి విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులు పరిహారం కోరుతూ అర్జీలు ఇచ్చారు. ఆర్ఓఆర్‌కు 17 వినతులు, ఇళ్లపట్టాకు, కోర్టు వివాదానికి సంబంధించి అర్జీతో 19 వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ అశోకొరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయరు శేషమరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

పుత్తూరు అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పుత్తూరు, వడమాలపేట మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 12 పోస్టు భర్తీకి ఐసీడీఎస్ ప్రాజెక్టు నోటిఫికేషన్ జారీ చేసింది. వేణుగోపాలపురంలో మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త, వినాయకపురం ఎస్టీ కాలనీలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులతో పాటు నేసనూరు, రామకృష్ణాపురం, వి.ఎస్.ఎస్.పురం, రామసముద్రం, అకారి హరిజనవాడ, ఉత్తరపు కండ్రిగ హరిజనవాడ, జయరాణిపురం, పీఆర్ మంగళం, వేమపురం, అప్పయ్యగుంటల్లో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహిళా అభ్యర్థులు టెన్త్ ఉత్తీర్ణత సాధించి ఉండి స్థానికులై ఉండాలి. ఈ ఏడాది జులై 24 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి. దరఖాస్తులను 2025 జనవరి 6వ తేదీ లోగా పుత్తూరు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంది.

పిచ్చాటూరు పరిధిలో...

పిచ్చాటూరు: పిచ్చాటూరు ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో శోభారాణి తెలిపారు. మండలంలోని రెప్పాలపట్టు, కీళపూడి(2) మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్టీ కేటగిరికి చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా పోస్టు అడవికండ్రిగ(బీసీ డీ) కేటాయించబడి ఉందని, స్థానికులై ఉండి టెన్త్ ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులన్నారు. 2025 జనవరి 6 ఆఖరి తేదీలోగా పిచ్చాటూరు సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు అందివాల్సి ఉంటుంది.

నాగలాపురం: మండలంలోని రాజులకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో శోభారాణి పేర్కొన్నారు. 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి టెన్త్ ఉత్తీర్ణులైన మహిళలు అర్హులన్నారు. దరఖాస్తులను 2025 జనవరి 6వ తేదీ లోపు పిచ్చాటూరు ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



శ్రీకాళహస్తిలో ర్యాలీ చేస్తున్న క్రిస్టియన్లు

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్‌బీసీ కాలనీ ఉన్న సెయింట్ జేవియర్స్ పాఠశాలలో సోమవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోమన్ క్యాథలిక్ చర్చి ఫాదర్ రెవరెండ్ ప్రీతం హాజరై విద్యార్థుల చేత ప్రార్థనలు చేయించారు. క్రిస్మస్ విశిష్టతను వివరించారు. ఆనంద్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ షెర్లి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలో క్రిస్మస్‌ను పురస్కరించుకుని శ్రీకాళహస్తి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రజలకు క్రీస్తు జన్మదినం, శాంతి సందేశం తెలుపుతూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ అంబ్రోస్, సుందరాజు, రవి డ్యాని, ఎలీషా, రఫాయేల్, జోసెఫ్, మణి,బాబ, మోజస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శ్రీనివాసతేజ పాఠశాలలో ప్రీ క్రిస్మస్ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాంటాక్లాస్ దుస్తులలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుధాకర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండల కేంద్రంలోని షారోన్ మందిరంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆదిమూలం హాజరయ్యారు. ఆయన మహిళలకు చీరలు పంపిణీని చేశారు. ఈ చీరల పంపిణీకి ఆర్థిక సాయం చేసిన డాక్టర్ రమేష్‌ను అభినందించారు. వగత్తూరు సర్పంచ్ వెంకటమ్మ, గోపాల్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంలో నాణ్యత పాటించండి



అధికారులకు సూచనలిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్

నారాయణవనం, డిసెంబర్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యాశాఖ కార్యాలయం ప్రహరీ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్ కోరారు. సోమవారం ఆయన నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రహరీ నిర్మాణానికి జడ్పీ నిధులు రూ.5 లక్షలు మంజూరు చే యించానని త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. ఎంఈవో ప్రభాకర రాజు, సిబ్బంది ఉన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అంగన్‌వాడీ పోస్టులకు
దరఖాస్తు చేసుకోండి

గూడూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 3 అంగన్‌వాడీ కార్యకర్తలు, 4 సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేష్ విడుదల చేసినట్లు సీడీపీవో మెహబూబి తెలిపారు. గూడూరు పట్టణ పరిధిలోని మాళవ్యానగర్, ఆస్పత్రి రోడ్డు, చిల్లకూరు మండలంలోని తిమ్మనగారిపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, గూడూరు పట్టణంలోని ఆస్పత్రి రోడ్డు, మండలంలోని నెర్నూరు, మంగళపూరు, చిల్లకూరు మండలంలోని బల్లవోలులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత కలిగిన వారు జనవరి 6వ తేదీలోగా దరఖాస్తులను ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

కోట ఐసీడీఎస్ పరిధిలో...

కోట(ఆంధ్రజ్యోతి): కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో మునికుమారి కోరారు. చిట్టమూరు మండలంలోని చిట్టమూరు గ్రామంలో ఒకటి(ఓసీ), కోట మండలంలోని నెల్లూరుపల్లిలో ఒక పోస్టు (ఓసీ) ఖాళీ ఉన్నాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయసున్న వారు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు జనవరి 8వ తేదీ లోగా కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో తెలిపారు.

వెంకటగిరి ఐసీడీఎస్ పరిధిలో...

వెంకటగిరి టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో షంషాద్ బేగం కోరారు. అంగన్‌వాడీ టీచర్లు రెండు ఆయా పోస్టులు 11 ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం: కురుగొండ్ల



టిడ్కో ఇళ్ల వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని టిడ్కో ఇళ్లను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధి జాడే లేదన్నారు. వెంటకగిరి పట్టణంలో గత పాలకుల పాపాల వల్ల జనం ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొటిగా చక్కదిద్దుతున్నట్లు వివరించారు. తాగునీటి పైపులైన్లు దెబ్బతినడంతో వాటిని బాగుచేసేకొనే పక్రియ జరుగుతోందన్నారు. గ్రామాల్లో కూడా పరిస్థితి దారుణంగా ఉందని, ప్రతి పల్లెకు రహదారి, తాగునీరు, రవాణా తదితర మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు తదితరులు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి గాయాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట - దొరవారిసత్రం మధ్యలో పోలిరెడ్డిపాలెం సమీపంలో సోమవారం సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి సనోజ్ సద్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

కోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోట సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌పై దాడిచేసిన కేసులో చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న కిరణ్‌కుమార్‌పై చెంచయ్య రాడ్‌తో దాడిచేసి గాయపరచిన సంఘటన తెలిసిందే.

జిల్లాస్థాయి టెన్నికాయిట్ జట్టు ఎంపిక

గూడూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఈనెల 26వ తేదీన జిల్లాస్థాయి జూనియర్ టెన్నికాయిట్ జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్, కార్యదర్శి రమ్య తెలిపారు. 2006 ఏప్రిల్ 1వ తేదీ, ఆ తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే వారు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాన్ని తీసుకు రావాలన్నారు. ఎంపికైన విద్యార్థులు వచ్చే ఏడాది జనవరి 11, 12 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

దేశానికి రైతే వెన్నెముక



రైతు దినోత్సవంలో విద్యార్థులు

గూడూరు, చిల్లకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశానికి రైతన్నే వెన్నెముక అని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జయంతి సందర్భంగా జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నలు కష్టపడి, శ్రమించి పంటలు పండించి దేశంలో ఉన్న ప్రతి పౌరుడికీ ఆహారాన్ని అందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు ఉద్యోగంతో పాటు వ్యవసాయం చేస్తూ దేశాభివృద్ధికి పాటు పడాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, హరిబాబు, హరిబ్రహ్మ, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. ● చిల్లకూరు మండలంలోని చింతవరం రేస్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులను పొలంలోకి తీసుకువెళ్లి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, కరస్పాండెంట్ బాలచెన్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కుల గురించి తెలుసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్, పక్కన రాజారెడ్డి, మునిరెడ్డి, తొప్పాని కృష్ణ, ఆషీష్‌బాబు, ప్రసాద్

నాయుడుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ అన్నారు. సోమవారం నాయుడుపేట టీఎంఆర్ డిగ్రీ కళాశాలలో చేయూత చైల్డ్‌హోమ్, సంపూర్ణ సొసైటీ సంయుక్తంగా వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వస్తువుల కొనుగోళ్లల్లో నాణ్యత, ప్రమాణాల్లో సమస్యలు ఎదురైతే వినియోగదారుల హక్కుల చట్టం ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా బిల్లులను తప్పక తీసుకోవాలని, తద్వారా ఏదైన లోపాలు ఉంటే పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీఎంఆర్ విద్యాసంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి, వినియోగదారుల సంఘ అధ్యక్షుడు రాజారెడ్డి, కార్యదర్శి దాము, మునిరెడ్డి, హ్యూమన్ రైట్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆషీష్‌బాబు, చేయూత ప్రతినిధి తొప్పాని కృష్ణ, సంపూర్ణ సొసైటీ ప్రతినిధి ముప్పాళ్ల వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, పక్కన సర్పంచు పెంచలయ్య, ఆర్‌ఐ సంతోషీబాయి, సర్వేయర్ పూజిత

పెళ్లకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి కోరారు. పెళ్లకూరు మండలం అర్థమాల గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గతంలో ప్రభుత్వం బీసీలకు ఎకరం చొప్పున భూములు పంపిణీ చేసిందని, అయితే అర్ధ ఎకరానికి మాత్రమే పట్టాలు ఇచ్చారని తహసీల్దార్‌కు విన్నవించారు. తాము 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా తూర్పుతోటలోని పొలలాకు వెళ్లే దారి ఆక్రమించారని, ఆక్రమణలు తొలిగించి దారి చూపాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో సర్పంచు పెంచలయ్య, ఆర్‌ఐ సంతోషీబాయి, వీఆర్వోలు భూదనం రమేష్, సుధాకర్, మండల సర్వేయర్ పూజిత, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, పునబాక పోలయ్య, నరేంద్ర యాదవ్, మునివర్ధన్‌రెడ్డి, వాటంబేటి నాగరాజు మణి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి: నెలవల



ప్రసాద్ నాయుడిని సత్కరిస్తున్న మాజీ ఎంపీ నెలవల, పక్కన టీడీపీ నాయకులు

నాయుడుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలతో పాటు ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షులుగా గెలుపొందిన ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సూచించారు. సోమవారం నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడును నెలవల సుబ్రహ్మణ్యం పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, అక్కరపల్లి మాధవరెడ్డి, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, కన్నలి వాసు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రమణకుమార్, పక్కన సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది

గూడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ రమణకుమార్ అన్నారు. సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ నేరాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శునకాలకు విషాహారం

సూళ్లూరుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విషాహారం తిని శునకాలు మృతి చెందిన సంఘటన సోమవారం సూళ్లూరుపేట పట్టణంలో చోటుచేసుకొంది. పట్టణంలోని సాయినగర్, పరమేశ్వ నగర్, గాండ్లవీధి ప్రాంతాల్లో దాదాపు పది కుక్కలు చనిపోయి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. గాండ్లవీధి బిడ్డి కింద మృతి చెందిన కుక్కల పక్కన విషం కలిపిన బిరియానీ ప్యాకెట్ ఉంది. బిరియానీలో విషం కలిపి కుక్కలకు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఇటీవల పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉంది. ఈనేపథ్యంలో ఎవరైనా ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని స్థానికులు చెబుతున్నారు.

30న పంచాయతీ దుకాణాల వేలం

కోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోట పంచాయతీలోని 25 దుకాణాల లీజుకు సంబంధించి ఈనెల 30న వేలం నిర్వహించనున్నట్లు సర్పంచు వెంకటరమణమ్మ తెలిపారు. పట్టణంలోని బజారు సెంటర్, బాలికల ఉన్నత పాఠశాల, ఆర్టీసీ సెంటర్‌లో పంచాయతీకి చెందిన దుకాణాలకు డీఎల్‌పీవో, ఈవోపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద గాంధీనగర్‌వాసులు

గూడూరు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక దివిపాళెం పంచాయతీలో రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని గాంధీనగర్ వాసులు కోరారు. సోమవారం వారు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఏసుపాక పెంచలయ్య మాట్లాడుతూ ఇటీవల దివిపాళెం పంచాయతీకి సంబంధించి గాంధీనగర్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారన్నారు. స్థానికులు పలు సదస్సులపై వినతులు అందజేయడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి దారేదీ?



వరి పొలాల మీదుగా మృతదేహాన్ని మోసుకెళ్తున్న కానూరువాసులు

పెళ్లకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో ఆఖరి మజిలీ అయిన అంత్యక్రియలను నిర్వహించలేని దుస్థితి పెళ్లకూరు మండలం కానూరులో నెలకొంది. గ్రామానికి చెందిన వెంపళ్ల పెంచలమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు దారిలేకపోవడంతో ఒకటిన్నర కిలోమీటరు దూరం పొలాలు, కంపచెట్లలో నడుచుకుంటూ మోసు కెళ్లాల్సి వచ్చిందని గ్రామస్తులు వాపోయారు. శ్మశానానికి దారిచూపాలని అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్న వించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

ఏర్పేడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నసముద్రం మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు దొరస్వామి శెట్టి(82) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. మంగళవారం ఉదయం 11గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



గుంజి సురేష్ (ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, డిసెంబర్ 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని కొత్తగుంటకు చెందిన గుంజి సురేష్(30) ఈనెల 21న ఇంటి నుంచి మల్లాంకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా సోమసముద్రం సమీపంలో గుంతలమైయమైన రోడ్డులో అదుపు తప్పి కిందపడ్డాడు. సురేష్‌కు తలపై తీవ్రమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విధిగా హెల్మెట్ ధరించండి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ రమణ, ఎస్‌ఐలు సుబ్బారావు, భవాని సిబ్బంది

వెంకటగిరి టౌన్, డిసెంబరు 23,(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులందరూ విధిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని వెంకటగిరి సీఐ రమణ అన్నారు. సోమవారం పట్టణ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారుడికి హెల్మెట్ భారం కాదని, ప్రమాద సమయంలో ప్రాణ రక్షణగా ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు కూడా శిక్షార్హులు అవుతారని అన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎస్‌ఐ సుబ్బారావు, భవాని, డక్కిలి ఎస్‌ఐ శివశంకర్, బాలాయపల్లి ఎస్‌ఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీతో వరి విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

పెళ్లకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వరినారు మడులు నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీతో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారిణి గొడవర్తి ప్రవీణ తెలిపారు. సోమవారం మండలంలోని పునబాక బీమవరం, టెంకాయతోపు, పెళ్లకూరు గ్రామాల రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, నాయకులు హరి నాయుడు, పునబాక పోలయ్య, యాగాని బెన్నీ, తాళ్ల యుగందర్ గౌడ్, తాళ్లరెడ్డి శ్రీనివాస్, సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, వీఏఏ దినేష్, సత్యం, శివ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న జాహ్నవి తిరుపతి జిల్లాలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించింది. దీంతో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి అభినందించారు. జాహ్నవితో పాటు జిల్లాస్థాయిలో ప్రతిభ చూపినవారిని కూడా అభినందించారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రతి విజయంలో కూడా పాలు పంచుకోవాలన్నారు.

కార్పొరేట్ల కోసమే వ్యవసాయ ప్రైవేటీకరణ



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశాన్ని కార్పొరేట్లకు దోచి పెడుతున్న మోదీ ప్రభుత్వం చివరకు వ్యవ సాయాన్ని ప్రైవేటు పరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఏపీ రైతు సంఘం నాయకులు ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరికి నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్ మాట్లాడుతూ... 2021లో పార్లమెంటు సాక్షిగా ప్రధాని మోదీ నల్లచట్టాలను ఉపసంహరించుకున్నారన్నారు. అయితే దొడ్డిదారిన కార్పొరేట్ కంపెనీలకు మేలు కలిగేలా వ్యవసాయాన్ని ప్రైవేటీకరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేస్తూ జీవో జారీ చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని మార్కెట్ కమిటీలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని రైతు సంఘ నాయకులు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ 27 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్రంప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదన్నారు. అనంతరం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.పుల్లయ్య, పి.గురవయ్య, మునిశంకర్, శంకరయ్య, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సంఘమిత్రలపై చర్యలు తీసుకోండి


మహిళా సంఘాలతో సమావేశమైన అధికారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిధులు దుర్వినియోగం చేసిన మాజీ సంఘమిత్రలపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు కోరాయి. తొట్టంబేడు మండలం చియ్యవరంలో స్త్రీనిధి రికవరీ క్యాంపును అధికారులు నిర్వహించారు. గతంలో పనిచేసిన సంఘమిత్రలు బ్యాంకు, స్త్రీనిధి రుణాలను సభ్యుల వద్ద వసూలు చేసి బ్యాంకులకు జమ చేయలేదని ఆరోపణలు రావడంతో అప్పట్లో వెలుగు పీడీ విచారణ కమిటీని నియమించారు. ఆ విచారణలో గ్రామంలో ఇద్దరు సంఘమిత్రలు రూ.2.16కోట్లు దుర్వినియోగమైనట్టు తేల్చారు. అందులో ఇప్పటి వరకు రూ.54లక్షలే రికవరీ చేసినట్టు అధికారులు తేల్చారు. సోమవారం స్త్రీనిధి జిల్లా అధికారులు గ్రామంలో మహిళలతో సమావేశమయ్యారు. నిధులు దుర్వినియోగం చేసిన మాజీ సంఘమిత్రలపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించామని చెప్పారు. బైలా అనుసరించి డబ్బు దుర్వినియోగంపై గ్రామసంఘం సిబ్బందిపై చర్యలు తీసుకునే అవకాశం సభ్యులకే ఉంటుందన్నారు. గడువులోగా మాజీ సంఘమిత్రలు నగదు చెల్లించలేకపోవడంతో గ్రామసంఘ నిర్వాహకులే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు. స్త్రీనిధి ఏజీఎం హేమంత్‌కుమార్, మునిరత్నం, ఏపీఎం ఇందిరాగాంధీ, స్థానిక నాయకులు కృష్ణయ్య, వెంకటరమణ, రాజనాల తదితరులు పాల్గొన్నారు.

బొజ్జల హయాంలో నిర్లక్ష్యానికి చోటు ఉండదు


సమావేశంలో మాట్లాడతున్న బీసీ సెల్ నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ఎదుర్కొని నియోజకవర్గంలో ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించిన ఎమ్మెల్యే సుధీర్ హయాంలో నిర్లక్ష్యానికి చోటు ఉండదని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అనుచరుల మోసానికి బలైన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బాసటగా నిలిచారన్నారు. రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో మధు అనుచరుల భూదోపిడీపై త్వరలోనే చర్యలుంటాయన్నారు. వన్నియకుల కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నలరవి, టీడీపీ బీసీ నాయకులు ఉమేష్‌రావు, కోట చంద్రశేకర్, కుమార్, భాస్కర్, మణి, సయ్యద్ చాంద్‌బాషా, నూర్ మహమ్మద్, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

పిచ్చాటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీ యానాది సెంటర్‌లో సోమవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ సంఘ నాయకులు మాట్లాడుతూ దుబారా ఖర్చులు చేయడం కన్నా నిరుపేదలకు వస్త్రదానం చేస్తే దేవుడు కరుణిస్తాడని తెలిపారు. పాస్టర్ పి.జి.శేఖర్, దురైరాజ్ పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

వరదయ్యపాళెం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఏఈ విజయవెంకటేష్ తెలిపారు. వరదయ్యపాళెం సబ్‌స్టేషన్ వద్ద వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, మిగిలినవారికి రాయితీతో అందిస్తామన్నారు. మండలంలో నాలుగిళ్లలో అమర్చినట్టు తెలిపారు.

రాచగున్నేరి చెరువుకు చెర


రాచగున్నేరి చెరువు ఆక్రమణను చూపుతున్న మాజీ సర్పంచ్ జగన్నాథం నాయుడు

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచగున్నేరి చెరువును అక్రమార్కులు దర్జాగా చెర బట్టేస్తున్నారు. రాచగున్నేరిలో ఏపీఐఐసీ పారిశ్రామికవాడ ఉంది. ఇక్కడికి సమీపంలో పలు భారీ పరిశ్రమలున్నాయి. తిరుపతి, శ్రీకాళహస్తి జాతీయ రహదారికి ఆనుకుని రాచగున్నేరి చెరువు ఉంది. మొత్తం 11 ఎకరాల్లో చెరువు ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. ఈ చెరువుకు ఒక వైపున పరిశ్రమ, తూర్పు వైపున రాచగున్నేరి గ్రామానికి వెళ్లే రహదారి, దక్షిణం వైపున తిరుపతి జాతీయ రహదారి ఉంది. ఇంత విలువైన ప్రాంతం కావడంతో గత వైసీపీ పాలనలో ఈ చెరువుపై కొందరు అక్రమార్కులు కన్నేశారు. దర్జాగా కబ్జా చేసి సెంటు రూ.6లక్షలు చొప్పున విక్రయించారు. చెరువు కబ్జాను అరికట్టాలని రాచగున్నేరివాసులు గగ్గోలు పెడుతున్నా అప్పటి పాలకులు, అధికారులు కనీసం స్పందించలేదు. ఇక్కడ భారీ పరిశ్రమలు ఉండటంతో వలస కార్మికుల నివాస గదులకు భారీ డిమాండ్ ఉంది. రేకుల గదికి రూ.5వేలు, శ్లాబ్‌తో నిర్మించిన గదికి రూ.10వేలు అద్దె వస్తుంది. ఇంత డిమాండ్ ఉండటంతో గత పాలకులు మెల్లగా చెరువులో కొంత భాగాన్ని ఆక్రమించుకున్నారు. రోడ్డు పక్కన దుకాణాలను వెనుక పక్క వలస కార్మికులకు అద్దెగదులను నిర్మించారు. ఈ క్రమంలో ఏడాది క్రితం రాచగున్నేరి మాజీ సర్పంచ్‌లు జగన్నాథం నాయుడు, మోహన్‌నాయుడు గ్రామస్థులతో కలిసి చెరువు కబ్జాపై కోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయస్థానం నుంచి చెరువు భూమిని పరిరక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో ఏడాది క్రితం చెరువులో భారీగా అద్దెగదులు నిర్మిస్తున్న భవన పనులను అధికారులు నిలిపివేశారు. ఆ తరువాత కూటమి ప్రభుత్వం రావడంతో రాచగున్నేరి చెరువు కబ్జాలు తాత్కాలికంగా ఆగాయి. అయితే గత రెండు రోజుల నుంచి కొందరు మళ్లీ చెరువు భూమిలో వ్యర్థాల మట్టి తోలుతూ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. దీనిపై మాజీ సర్పంచ్ జగన్నాథంనాయుడు చెరువు భూమి వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఘటనా స్థలం నుంచే రెవన్యూ అధికారులకు కబ్జాపై ఫోన్ చేశారు. అధికారులు చెరువు భూమిని ఇకనైనా సమగ్రంగా సర్వేచేసి గత పాలన నుంచి ఇప్పటి వరకు ఆక్రమణకు గురైన భూమి మొత్తాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

నిర్ణీత గడువులోగా రెవెన్యూ సమస్యల పరిష్కారం


చిన్నసింగమాలలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు మధుసూదన్‌రావు

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చిన్నసింగమాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు మధుసూదన్‌రావు మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే అధికారులను పంపిస్తోందన్నారు. నిర్ణీత సమయంలోగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం ప్రజలు, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అదే విధంగా మధ్యాహ్నం గురుకుల పాళెంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఇక శ్రీకాళహస్తి మండలం మద్దిలేడులో తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

కేవీబీపురం: మండల కేంద్రంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భూ సమస్య ఏదైనా అర్జీ రూపంలో ఇస్తే వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలో ఇంటిస్థలాలు, వీధులు, వీధి దీపాలు, తాగునీటి సమస్యపై ఎక్కువగా అర్జీలు వచ్చాయని వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఇటీవల తుఫాన్‌కు కొట్టుకుపోయిన జయలక్ష్మీపురం, కోవనూరు, పూడి గ్రామాల కాజ్‌వేల నిర్మాణాలకు రూ.5కోట్లు మంజూరు చేయించానని త్వరలోనే పనులు ప్రారంభిస్తారని చెప్పారు. సర్పంచు గిరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు అయ్యప్ప, తహసీల్దారుముని రత్నం రెడ్డి, ఎంపీ డీవో రాధారాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని తంగేళ్ళపురం చెరువు ఆక్రమణలు తొలగించాలని సోమవారం బీఎన్ కండ్రిగ, కనమనంబేడుల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తంగేళ్లపురం చెరువును కొందరు రైతులు ఆక్రమించుకోవడంతో విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. దీంతో పంటలకు నీరు సరిగా అందడం లేదన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సర్వే చేసి చెరువు ఆక్రమణలను తొలగిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులో 26 అర్జీలు వచ్చాయి. ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు, సర్వేయర్ రాజ్‌కమార్, టీడీపీ నాయకులు మధునాయుడు, సర్పంచ్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలోని జీపాళెంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. శ్మశాన వాటికతోపాటు పలు సమస్యలపై అధికారులకు మొత్తం ఏడు దరఖాస్తులు అందాయి. పరిశీలించిన తహసీల్దారు సురేష్‌బాబు ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని రజానగరం, రామాపురంలలో సోమవారం రెవెన్యూ సదస్సులు తహసీల్దార్ రమేష్‌బాబు అధ్యక్షతన జరిగాయి. ఆన్‌లైన్‌లో చేర్పులు, మార్పులు, పట్టాదారు పాసు పుస్తకాలకు అర్జీలు అందించారు. ఆర్‌ఐ సుధాకర్, వీఆర్వో రూపేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి చల్లా గుణరంజన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పంట నమోదు చేసుకోండి

వరదయ్యపాళెం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు తాము వేసిన పంటలను సమీపంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఎకరా వరికి రూ.630, వేరుశనగకు రూ.450 బ్యాంకులో కానీ, పోస్టాఫీసులో, సీఎస్‌సీ, మీసేవ కేంద్రాల్లో చెల్లించవచ్చన్నారు. 31 వ తేదీలోగా చెల్లించాలన్నారు.

కారు ఢీకొని స్కూటరిస్టు మృతి

ఏర్పేడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు... ఏర్పేడు మండలం నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరికి చెందిన గాది వెంకటేష్(36) సమీపంలో ఉన్న చిందేపల్లి గిరిజనకాలనీలో కూలీల కోసం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఏర్పేడు - వెంకటగిరి రహదారిలో చిందేపల్లి వైపు వస్తూ రోడ్డు దాటుతుండగా ఏర్పేడు నుంచి వెంకటగిరివైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా వెంకటేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

పదోన్నతులు కల్పించండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ పరిధిలో పని చేస్తున్న తమకు పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ అనుబంధ తిరుపతి జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు సోమవారం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.పుల్లయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో అటెండర్, రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పలు జిల్లాలోల ఈ పోస్టులన్నింటికీ అర్హత ఉన్న వీఆర్‌ఏలతో భర్తీ చేశారని శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో కూడా ఆ తరహా ప్రయత్నం చేయాలన్నారు. పి.గురవయ్య, వీఆర్‌ఏలు అంకయ్య, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కరించండి

రేణిగుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరారు. మండలంలోని కరకంబాడి సబ్‌స్టేషన్ వద్ద సోమవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా వినియోగదారులు మాట్లాడుతూ లోవోల్టేజీ సమస్యపై గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో ఇబ్బంది పడుతున్నట్టు వాపోయారు. దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ రమేష్‌బాబు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈలు చంద్రశేఖర్‌రావు, పుణ్యకోటి, జేఈఈలు రజాక్, ప్రసన్న, టీడీపీ నాయకులు బుజ్జినాయుడు, నాదమునిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం వేగవంతం చేయండి: ఆదిమూలం


కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్తా తమ గ్రామ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేయించాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. కేవీబీపురం పట్టణంలో ఆయన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సత్యవేడు నియోజకవర్గంలో కేవీబీపురం పెద్ద మండలమని ఇక్కడే ఎక్కువ మంది సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలన్నారు. రూ.100తో సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. సభ్యత్వ నమోదులో జోరు పెంచాలని తెలిపారు. మల్లికార్జునరెడ్డి, జయరామిరెడ్డి, మణి, సర్పంచు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ తిరుమల అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ తిరుమల పట్టణ అధ్యక్షుడు రాజు యాదవ్ జన్మదిన వేడుకలు పాళెంలో జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు కూనాటి శివ యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. కేక్‌ను కట్ చేసి పంచిపెటారు. రాజుయాదవ్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు మనోహర్, హరి, సుబ్రహ్మణ్యం, జీవ, భాస్కర్, వంశీ, కృష్ణ, కిరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ముందుగా వినాయకుడికి పూజలు చేశారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

సమస్యలు పరిష్కరించండి

ఏర్పేడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాగాలి పంచాయతీ కుమ్మరిగుంటలో సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కోట వినుతకు వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు ఆమెను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వర్షాలు పడిన నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. అప్పట్లో ఎంపీడీవోకు విన్నవించినా స్పందించలేదని వాపోయారు.

ఆక్రమణలో పంటకాలువ


ఆక్రమణకు గురైన పంట కాలువ

వరదయ్యపాళెం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లంలో పంట కాలువ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈ బాబును మాజీ సర్పంచ్, రైతు ప్రభుదాస్ కోరారు. సోమవారం ఈ మేరకు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి కాలువ ఆక్రమణ వివరాలను పేర్కొంటూ వినతిపత్రం అందజేశారు. కొందరు ఉద్దేశపూర్వకంగా పంట కాలువలో పైపులు పెట్టి దానిపై మట్టి పోసి ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇసుక చెక్‌పోస్టు వెనుక, కారిపాకం రోడ్డు మలుపు వద్ద ఆక్రమణ జరుగుతోందన్నారు. దీంతో సుమారు 150 ఎకరాలకు నీరు రాకుండా పోతుందని పేర్కొన్నారు.

సేంద్రియ ఎరువులనే వాడండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మకొత్తూరు, రెడ్డిపల్లెల్లో సేంద్రియ, జీవ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వినూత్న ఆగ్రోటెక్ ఎల్ఎల్‌పీ మార్కెట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సాగులో రసాయన ఎరువులు అధికంగా వాడటం వలన భూమిలో సారంతో పాటు దిగుబడులు తగ్గిపోతున్నాయన్నారు. అంతే కాకుండా ఆహారం విషతుల్యం అవుతోందన్నారు. సేంద్రియ ఎరువులతో పెట్టుబడులు తగ్గడమే కాకుండా భూసారం పెరుగుతోందన్నారు.

ధ్యానంతో మానసికోల్లాసం

పిచ్చాటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా, ధ్యానం చేస్తే ఉల్లాసంగా ఉండవచ్చని యోగా గురువు మోహన్ తెలిపారు. పట్టణంలోని పీహెచ్‌సీ ఆవరణలో యోగా చేయడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు.